శంషాబాద్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా గణేష్



ఉత్తర్వులు అందుకుంటున్న రాచమల్ల జగన్

శంషాబాద్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ శంషాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడిగా రాచమల్ల గణేష్ నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు పి.పెంటయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ చేతులమీదుగా ఆయన ఉత్తర్వులు అందుకున్నాడు. దళితుల అభ్యున్నతికి కాంగ్రెస్ చేసిన కృషి మరే పార్టీ చేయలేదని ఆయన అన్నారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పి.సంజయ్‌యాదవ్, పరమేష్ అక్రమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు



జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: భావిభారత సమాజాన్ని నిర్మించేది ఉపాధ్యాయులేనని, వారి వృత్తికి ఉద్యోగ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమేనని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు శాంతాకుమారి శుక్ల ఉద్యోగ విరమణ కార్యక్రమంలో స్థానిక ఎంఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అంకిత భావంతో 36 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో ఆమె రాణించిందన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, ఎంఈఓ విజయ్ కుమార్, నాయకులు శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవుడే కాపాడుకోవాలా..?



హైదర్‌గూడ ప్రాంతంలో దేవాలయ భూముల్లో కొనసాగుతున్న ఇటుకల తయారీ కేంద్రాలు



అక్రమంగా కొనసాగుతున్న మార్బుల్స్ షాపులు

- దర్గాగా ఆలయ భూముల కబ్జా
- వ్యాపార కేంద్రాలు, పెద్ద నిర్మాణాలు
- ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి
- ప్రభుత్వానికి స్థానికుల విన్నపాలు

అత్తాపూర్: రంగారెడ్డి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ తీసుకున్న నిర్ణయంలో భాగంగా కోట్లాది రూపాయలకు చెందిన విలువైన భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో నిమగ్నమైపోయింది. అందులో భాగంగా అత్తాపూర్ సర్వే నంబర్ 435, 446 అనంత పద్మనాభ స్వామికి చెందిన రూ.వందల కోట్ల విలువ చేసే భూమిని స్వాధీనం చేసుకొని ఈ భూమిని రంగారెడ్డి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖలకు చెందినదిగా సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. అత్యంత విలువ చేసే కోట్లాది రూపాయల ఆస్తులను దేవుడి మాన్యం భూములకు రక్షణ కరువైందన్న నేపథ్యంలో స్థానికులు పెద్ద ఎత్తున కొన్ని సంవత్సరాలుగా న్యాయస్థానాలను ఆశ్రయిస్తూ వస్తున్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దేవస్థాన భూములను అప్పగించాలని కోరుతూ సంబంధిత వ్యక్తులకు నోటీసులు కూడా జారీ చేసింది. ఈ నేపథ్యంలో కబ్జాదారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. అత్తాపూర్, రాంబాగ్‌లో చారిత్రాత్మకమైన దేవాలయాలు ఉన్నాయి. సీతారామచంద్రస్వామి దేవాలయం, దుర్గదేవి, చిన్న అనంతగిరి శివాలయంతో పాటు సూర్యచంద్రుల దేవాలయాల భూములు సర్వే నంబర్ 72, 73, 74, 75, 76, 77, 253, 345, 346, 49, 350, 51, 381, 396, 352/2, 350, 352/2, 352/3, 352/4, 354/4, 384, 384/4 సర్వే నంబర్లలో 52 ఎకరాల 23 గుంటల ఎకరాల స్థలం ఉంది. 52 ఎకరాల వేల కోట్ల రూపాయల ఆస్తిని స్థానిక పెద్ద మనుషుల పేరుతో చలామణి అవుతున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు వారికి వత్తాసు పలికే అనుంగ శిష్యులు ఆక్రమించుకున్నారు. ఆక్రమించుకున్న స్థలాల్లో సిమెంటు, స్టీల్ దుకాణాలు, మార్బల్ షాపులు, గ్రానైట్ దుకాణాలు, ఇసుక వ్యాపారాలు, ఇటుకలు తయారు చేసే మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్లు దుకాణ సముదాయాలు, షాపింగ్ మాల్స్, గృహ సముదాయాలు, వ్యాపార వాణిజ్య సంస్థలు వెలిశాయి. 52 ఎకరాల స్థలాల్లో కొంత మంది పక్కా నిర్మాణాలు చేసుకోగా మరికొంత మంది భారీ ఎత్తున షెడ్లు ఏర్పాటు చేసుకున్నారు. అనంత పద్మనాభ స్వామి దేవాలయ భూములను గురువారం స్వాధీనం చేసుకున్న క్రమంలో రాంబాగ్ రాములోరి భూములు కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని భూకబ్జాదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

అన్ని భూములను స్వాధీనం చేసుకోవాలి



దుర్గామాత ఆలయ సేవా సమితి, నవరాసేనల విన్నపాన్ని పరిశీలించి కొంత భూమిని కాపాడిన దేవాదాయ శాఖకు ధన్యవాదాలు, ఇంకా ఎన్నో భూములు కబ్జాలకు గురయ్యాయని వాటిని కూడా కాపాడాల్సిన బాధ్యత చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సింగా కోరుతున్నాం.
– ఉమామహేశ్వరిరెడ్డి, జనహిత వెల్ఫేర్ సొసైటీ స్థాపకురాలు

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు గోకరి సురేష్‌గౌడ్

బండ్లగూడ: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ పనులు పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గోకరి సురేష్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కాలనీవాసులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు స్వామి, ప్రకాష్, గోవింద్‌నాయక్, వెంకటేష్, సురేష్‌నాయక్, రవినాయక్, సిద్ధేశ్వర్‌గౌడ్, రవికుమార్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి మహోత్సవాలు షురూ



మహా శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చిన్న అనంతగిరి శివాలయంలో మహా శివరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. హైదర్‌గూడ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో మంగళవారం ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా దాదాపు 50 వేలకుపైగా భక్తులు వస్తారన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌గౌడ్ తదితరులు శివాలయానికి వచ్చి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాజం అధ్యక్షుడు మోండ్ర నర్సింహ, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ఉపాధ్యక్షుడు బర్ల మల్లారెడ్డి, కోశాధికారి ఎస్.బి.హరినాథ్, ముఖ్య సలహాదారులు మల్లారెడ్డి, ప్రచార కార్యదర్శులు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లే పార్కింగ్‌కు అడ్డా



కాళీ మందిర్ ప్రాంతంలో రోడ్డుపై ఇష్టానుసారంగా నిలిపిన వాహనాలు

బండ్లగూడ: ప్రధాన రహదారులపై ఇష్టారాజ్యంగా వాహనాలను పార్కు చేస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై ఇష్టానుసారంగా రోడ్డుపై అడ్డగోలుగా పార్కింగ్ చేస్తున్నారు. అలాగే రోడ్డుపైనే చిరు వ్యాపారులు సైతం కొనసాగిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు వాహనదారులు రోడ్డుపైనే వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నారు. ఎప్పుడు రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై పార్కింగ్ చేస్తుండటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అవుతోంది. సంబంధిత అధికారులు పర్యవేక్షించి చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల పర్యటన

గోల్కొండ: పోలీసులు, రాష్ట్ర పురాతత్వ శాఖ అధికారులు మంగళవారం టూంబ్స్ చౌరస్తా వద్ద గల తౌహిద్ మసీదు వెనుక గల ప్రభుత్వ స్థలంలో పర్యటించారు. ఈ మసీదు వెనుక భాగంలో ఉన్నత స్థలంలో మసీదు కమిటీ వారు నిర్మాణ పనులు ప్రారంభించడంతో గత వారం రాష్ట్ర పురాతత్వ శాఖ వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నారంటూ పనులను ఆపివేశారు. ఈ విషయంపై స్థల పరిశీలన కోసం పోలీసులు, అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్, రాష్ట్ర పురాతత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాములు తదితరులు నిర్మాణ ప్రదేశాన్ని సందర్శించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



ఏజీవర్సిటీ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తూ దేశం గర్వించే ఉత్తమ పౌరులుగా మారాలని పిలుపునిచ్చారు. పశు వైద్య విశ్వవిద్యాలయంలో మూడవ ఇంటర్ కాలేజీ క్రీడా సాహితీ, సాంస్కృతిక పోటీలు మంగళవారం ముగిశాయి. కార్యక్రమానికి వీసీ జ్ఞాన ప్రకాశ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలతో వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలియజేశారు. సిబ్బందికి కూడా క్రీడలు పని ఒత్తిడిని దూరం చేసే మెడిసిన్‌లా పనిచేస్తాయని, నిత్యం క్రీడల్లో పాల్గొనడంతో దీర్ఘకాలిక వ్యాధులు ధరిచేరవని అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర శరత్‌చంద్ర, డీన్ సతీష్‌కుమార్, అసోసియేట్ డీన్ మాధురి పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ హసన్‌నగర్‌లోని మదీనా మసీదు సమీపంలో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్థానిక ప్రజల నుంచి స్పందన లభించింది. వైద్య శిబిరంలో రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ నాయకులు సోహెల్ తదితరులు పాల్గొన్నారు.





గాలయ్యకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: విద్యారంగంలో 35 ఏళ్ల పాటు అపార సేవలు అందించిన తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీఆర్‌ఎస్ఎంఏ) ఆసిఫ్‌నగర్ మండలి అధ్యక్షుడు, విఘ్నేశ్వర స్కూల్స్ వ్యవస్థాపకుడు బి.గాలయ్యకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం చేశారు. జియాగూడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో టీఆర్ఎస్ఎంఏ, అరస్తూ జూనియర్, డిగ్రీ కాలేజీ సంయుక్తంగా ఈ అవార్డును ఆయనకు ప్రదానం చేశాయి. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల కోసం ఓరియెంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.

27న విద్యార్థుల నిరసన

రాయదుర్గం: ప్రభుత్వం వెంటనే టీఎస్–ఈపాస్ ఫెలోషిప్‌లను అందించాలని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటలకు హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేయాలని నిర్ణయించారు. విద్యార్థి లోకమంతా సంఘటితం కావాలని వారు కోరారు.

ఉత్సాహంగా 'ఫ్యామిలీ బ్లూమ్'



గోల్కొండ: మెహిదీపట్నంలోని శ్రీ చైతన్య పాఠశాలలో మంగళవారం 'ఫ్యామిలీ బ్లూమ్'కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ చైతన్య పాఠశాల ఏజీఎం బి.కృష్ణ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు కూడా బోధిస్తున్నామన్నారు. కుటుంబ సభ్యుల ప్రాధాన్యం పిల్లలతో తల్లిదండ్రుల అనుబంధం తదితర విషయాలు నేర్పిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రులు, కుటుంబ పెద్దలకు పాదపూజ చేసి వారికి బహుమతులు అందించి వారి ఆశీర్వాదాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వాతి, డీన్ మల్లేష్, ఆర్ఐ హరికృష్ణ, ఇన్‌చార్జులు నదీమ్, బాలరాజు, రవి, షగుఫ్త, కో ఆర్డినేటర్ ప్రవీణ్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మదీనా బయలుదేరిన యాత్రికులు



శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి మంగళవారం తెలంగాణ, కర్నాటక, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 50మంది యాత్రికులు మదీనా యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా యాత్రికులకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. మదీనా అనంతరం యాత్రికులు మక్కాలో ఉమ్రాను పూర్తి చేసుకుని 15 రోజుల్లో తిరిగి వస్తారని యాత్ర నిర్వహణ చేపడుతున్న అల్‌మిజాన్ సంస్థ అధ్యక్షుడు ఫయాజ్ అలీ తెలిపారు.



పాడైన రోడ్లను తిరిగి నిర్మించాలి

- మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి



భాగ్యలక్ష్మి కాలనీ రోడ్లను పరిశీలిస్తున్న డీఈ, మాజీ వైస్ చైర్మన్లు

మణికొండ: తాగునీటి, డ్రైనేజీ, కేబుల్‌లు తదితర పనులు చేపట్టడంతో భాగ్యలక్ష్మి కాలనీలో రోడ్లు పాడైపోయాయని, వాటిని తొలగించి కొత్త రోడ్లను నిర్మించాలని మణికొండ మున్సిపల్ డీఈ శివ సాయిని మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి కోరారు. కాలనీలో మంగళవారం ఆయన పర్యటించి రోడ్లను పరిశీలించారు. ఎక్కువ చోట్ల గుంతలు పడి ప్రజలకు ఇబ్బందిగా మారిందని, వాటికి కొత్త రోడ్లను వేయాల్సిన అవసరం ఉందన్నారు. గత మున్సిపల్ సమావేశంలో తీర్మానం సైతం చేశామని, త్వరగా పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దేవరాజుల నాయుడు, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, నాయకులు ఎం.రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీరంగూడ, ఏడుపాయల జాతరకు బస్సులు

రాయదుర్గం: మహా శివరాత్రిని పురస్కరించుకొని పటాన్‌చెరు నుంచి బీరంగూడ ఆలయానికి అలాగే ఏడుపాయల జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో, మియాపూర్ డిపో, కూకట్‌పల్లి డిపోలకు చెందిన బస్సులను బీరంగూడ వరకు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌సీయూ డిపో అధికారులు సూచించారు.

టీవర్క్స్‌లో ఫ్లాష్‌మాబ్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీవర్క్స్‌లో కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది. దాదాపు 1000 మంది విద్యార్థులు, యువత చిత్రాలను తిలకించారు. టీవర్క్స్, ఆర్టిజన్స్ ఫ్లీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఫ్లాష్‌మాబ్‌లో విద్యార్థులు, యువత నృత్యాలు ఆకట్టుకున్నాయి, కాగా కళలు, కథలు, ప్రదర్శనలు, సృజనాత్మక అంశాలపై గీతాభాస్కర్, హరీష్ భాగవతులు, ఇషాక్‌జియా, ప్రియతమ్‌లతో చర్చా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..

గచ్చిబౌలి: విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. మంగళవారం గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలలో సెల్ఫ్ గవర్నమెంట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో పాఠాలు చెప్పారు. హెచ్‌ఎం, మధుమతి, టీచర్లు అమర్, సుజాత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు



దేవాలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కమిటీ నాయకులు

మణికొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని శివాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని మణికొండ శ్రీపార్వతీరామలింగేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కె.నరేందర్‌రెడ్డి, చైర్మన్ సి.రాజేందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి యాలాల నరేష్ అన్నారు. దేవాలయంలో కొనసాగుతున్న ఏర్పాట్లను కమిటీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చే భక్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ తగలకుండా చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉదయం 4గంటల నుంచి మధ్యాహ్నం వరకు సామూహిక అభిషేకాలకు అవసరమైన క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం స్వామి వారి పల్లకీ సేవ, రాత్రికి 9 గంటలకు కల్యాణం, రాత్రి 11గంటల నుంచి లింగోద్భవకాల రుద్రాభిషేకం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి ఎం.రాఘవరెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎం.సురేందర్‌రెడ్డి, బి.రవికాంత్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జునశర్మ తదితరులు పాల్గొన్నారు.

హలీం తయారీలో శుభ్రత పాటించాలి



హలీం విక్రయదారులతో సమావేశమైన వెస్ట్ జోనల్ వెటర్నరీ డీడీ విల్సన్

గచ్చిబౌలి: రంజాన్ మాసంలో హలీం తయారీలో శుభ్రత పాటించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ విల్సన్ పేర్కొన్నారు. మంగళవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో జడ్సీ ఉపేందర్ రెడ్డి ఆదేశాల మేరకు హలీం విక్రయదారులతో సమావేశం ఏర్పాటు చేశారు. రంజాన్ మాసంలో హలీం విక్రయించే వారు నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. కల్తీ పదార్థాలు వాడొద్దని, శుభ్రత పాటించకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వెటర్నరీ ఆఫీసర్ బాసిత్, మెడికల్ ఆఫీసర్లు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్స్ పాల్గొన్నారు.

యువ ఇంజినీర్లు స్టార్టప్‌లను సృష్టించాలి



సదస్సులో అధ్యాపకులు, విద్యార్థులు

మణికొండ: సమాజానికి అవసరమైన ఎన్నో స్టార్టప్‌లను యువ ఇంజినీర్లు ఆవిష్కరించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా వారు కృషి చేయాలని మహాత్మా గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంజీఐటీ) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. కళాశాలలో ఐడియా ఇంక్యూబేటర్ ఆధ్వర్యంలో బ్రైట్‌పిచ్ సహకారంతో 'బిల్డ్ ఇట్–ఎర్న్ ఇట్' వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్ డాక్టర్ కేసీ సవితతో కలిసి ప్రారంభించిన ఆయన మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమంతో విద్యార్థులకు ఫ్రీలాన్సింగ్, వెబ్ డెవలప్‌మెంట్‌లో అవగాహన పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వెబ్ డెవలప్‌మెంట్ సెషన్‌లో, ఎస్–పీచ్ సీఈఓ నివాస్ నల్లా నోకోడ్, లోకోడ్ వంటి ఆధునిక టెక్నాలజీలను వివరించారు. 75మంది విద్యార్థులు సొంత పోర్ట్‌ఫోలియో వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఫ్రీలాన్సింగ్ 101 సెషన్‌లో, బ్రైట్‌పీచ్ వ్యవస్థాపకుడు ఆయుష్ మాట్లాడుతూ క్లయింట్ పొందే మార్గాలు, ప్రైసింగ్ స్ట్రాటజీలు, బ్రాండింగ్ వంటి ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు.